

# అల్లుడుగారు

**-డాక్టర్ రాగతి రమ**

**"నాన్నా మీ అల్లుడు గారు మీకు ఉత్తరం రాశారు" అంది వసంత చాలా సంతోషంగా.**

**పే**పరు చదువుతున్న సుందర రామయ్య అది ప్రక్కన పెట్టి - "ఏం రాశాడమ్మా అల్లుడు ...?" అన్నాడు. అలా అన్నాడేగాని ఆయన గుండె పీచు పీచుమంటూ ఉంది. పండగ ముందు కొత్తల్లుడు ఉత్తరం రాశాడంటే ఆటంబాంబు పేలినట్టే. అంతే కాక వసంత పండక్కని ముందుగా వచ్చింది. వచ్చిన దగ్గర్నుంచి ఒకటే సతాయింపు-

"నాన్నా మా ఆయనకి స్కూటర్ కావాలట. నువ్వేం కొనక్కరలేదులే. స్కూటర్‌కి అయ్యే డబ్బు ముప్పై వేలు ఇచ్చెయ్ ఆయనే కొనుక్కుంటారు ..."

ఎంత తేలిగ్గా అనేస్తుంది ... ముప్పై వేలంటే మాటలా ...? ఎక్కడి నుండి తేవాలి అంత డబ్బు ...? డబ్బు చెట్టు వుందా దులపడానికి ... చేసేది గుమస్తా ఉద్యోగం. వచ్చేది చాలీచాలని జీతం. ఇద్దరు కూతుళ్ళకి చదువులు చెప్పించి పెళ్ళిళ్ళు చేసేటప్పటికి తాతలు దిగొచ్చారు. ఉన్న ఒక్కగానొక్క కొడుక్కి పెద్ద చదువు చెప్పిస్తే బొంబాయిలో ఉద్యోగం వెతుక్కొని ఎవత్తినో కట్టుకొని సుఖంగా జీవిస్తున్నాడు. ఈ తల్లీదండ్రీగోల వాడికెందుకు ...? తను పోయాక మాత్రం ఈ ఇంటిమీద హక్కు వుందని వస్తాడు... అడ్డాల నాడు బిడ్డలు గాని గెడ్డాలొచ్చాక బిడ్డలా తన తెలివి తక్కువ గాని.

సుందర రామయ్య ఇలా ఆలోచిస్తూ ఉంటే - "ఏమిటి నాన్నోయ్ భయపడి పోతున్నారా ఆయన దగ్గిర్నుంచి ఉత్తరం అంటే ...?" అంది వసంత.

'కాదుగాని చదువమ్మాయ్' అన్నాడు సుందర రామయ్య వాలు కుర్చీలో వెనక్కివాలి.

వసంత గట్టిగా చదవ సాగింది.

"ప్రియమైన మామగార్కి,

హరిగోపాల్ నమస్కరించి రాయునది. వినాయక చవితికి నేను మూడు రోజులు సెలవు పెట్టి అక్కడకు వస్తాను. అసలు విషయం ఏమిటంటే నా స్కూటర్ పాతదై పోయినందువల్ల కొత్త స్కూటర్ కొనుక్కోడానికి ముప్పై వేలు సిద్ధం చేయగలరు. అత్త గారికి నా నమస్కారములు చెప్పగలరు. మీ ఇద్దరి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోగలరు.


ఇట్లు
హరిగోపాల్"

వసంత తల్లి సీతమ్మ కూడా అక్కడకు వచ్చి వింటూ వుంది. ఉత్తరం చదవడం అయిపోగానే -

"మా చేతిలో పైసా లేదమ్మలూ! వసంతా ఎక్కడ నుండి తేగలమే ముప్పై వేలు ...?" అంది.

అంతే గయ్యిమని లేచింది వసంత.

"ఏం అక్కయ్య పెళ్ళికి కట్నం లక్ష ఇచ్చారు. కొత్తల్లుడంటూ మొదటి పండక్కి బావ గారికి స్కూటర్ కొనివ్వలేదా ...! మాకేం ఇచ్చారు?




మాది ప్రేమ పెళ్ళి - గద్దించి రాబట్టే అత్త గారూ లేదు, ఆడబిడ్డా లేదు కదాని నాకేమన్నా కట్నం ఇచ్చారా ... ఇప్పుడు స్కూటర్‌కి డబ్బు లేదంటున్నారు. మీ అల్లుడి దగ్గిర నాకు ఎంత నామోషి... ఆయన ఒకటే నస పెడుతున్నారు నా దగ్గిర - కనీసం ఈ పండక్కి ఇదన్నా ఇస్తారా లేదా అని! అసలు నేనంటే మీకు ఇష్టం లేదమ్మా'' కళ్ళొత్తుకుంటూ గదిలోకి నడిచింది వసంత.

సీతమ్మ నోట మాట రానట్టు ఉండిపోయింది. ఆ తర్వాత తేరుకుని - ''చూశారా ... చూశారా ఎంతలేసి మాటలందో -!'' అంది.

తల పంకించాడు సుందర రామయ్య.

పెద్దల్లుడు జలగ. తనకు కావలసినవన్నీ ముక్కుపిండి వసూలు చేసుకున్నాడు. ఇలా మొదటి దాని మొగుడు కాల్చుకు తింటే ఇంక రెండో దాని మొగుడు కూడా తయారైనాడు. ఏదో బుద్ధిమంతుడు, కానీ కట్నం అడగ లేదనుకున్నాడు తను... ఛీ ఇతని బుద్ధి కూడా ఇంతేనన్న మాట. అసలు ప్రతీ వెధవా అత్తగారి సొమ్ము ఊరికే అనుభవించాలని చూస్తాడు...

పాపం వసంత మాత్రం ఏం చేస్తుంది ... ఇంట్లో దాన్ని ఇతగాడు నిలబడి నీళ్ళు తాగనివ్వడం లేదేమో! పెద్దల్లుడికి అది ఇచ్చారు, ఇదిచ్చారు అని వంతు లేస్తున్నాడేమో!! ప్రేమ పెళ్ళి... కట్నం తీసుకోలేదు అదీ బడాయి. ఇప్పుడంటే ఇప్పుడు పండక్కి ముప్పై వేల ముడుపు ఇవ్వమంటే ఎక్కడ నుంచి తేవాలి ...? ఈ అల్లుళ్ళు మారేదెప్పుడు ...? తనలాంటి మామలు రక్షింపబడేదెప్పుడు ...?

నిండా మునిగిన వాడికి చలి వుండదు. అప్పుల్లో కూరుకుపోయిన వాడికి భయం వుండదు అంటారు ... మరి తన సంగతి అలా కాలే... తన ఉద్దేశం ప్రకారం అప్పుచేసిన పప్పుకూడు అరగదు. తినీ తినకా ఎలాగో ఇన్నాళ్ళు బండి లాక్కొచ్చాడు. గౌరవంగా బ్రతికాడు ... ఇప్పుడు ఆ ముప్పై వేలకి అప్పు కోసం చెయ్యి చాచాలా ...?

సుందర రామయ్య కళ్ళల్లో కన్నీళ్ళు సుళ్ళు తిరిగాయి. భుజంమీద తుండుతో కళ్ళద్దుకొని లేచి వంటింటి వరకూ వచ్చి తొంగి చూశాడు. ఆయన్ని చూడగానే సీతమ్మ - 'రండి రండి ఒంటి గంట దాటుతూ ఉంది భోజనానికి రండి'' అని - ''అమ్మాయ్ వసంతా భోజనానికి రావే'' అని కేక పెట్టింది.

ముగ్గురూ భోజనానికి కూర్చున్నారు.

''అమ్మోయ్ మీరు కట్నం ఇవ్వలేదని రోజూ ఎన్ని మాటలు అంటున్నారోనే. పండక్కి స్కూటర్ డబ్బు ఇచ్చేటట్టయితేనే ఇక్కడకు వస్తారటమ్మా ... అంతే కాదమ్మా పెద్దల్లుడికి అంతా ముట్టచెప్పి నా దగ్గిర కొస్తేనేనా డబ్బు లేకపోవడం అంటున్నారమ్మా... ఒక్క రోజుకాదు నిత్యం నన్ను సతాయిస్తున్నారమ్మా. ఎలాగో ఆ డబ్బు సర్దుబాటు చేయండి'' అంది వసంత ముద్ద నోట్లో పెట్టుకుంటూ.

సుందర రామయ్య హృదయం కలుక్కుమంది. కూతుర్ని అలా సతాయిస్తున్నాడు రాస్కెల్.

పెద్దల్లుడు జలగ అయితే చిన్నల్లుడు తోడేలు. ఈ అల్లుళ్ళకి తెలిసొచ్చేది మళ్ళీ తమ కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చేస్తేనే. రాక్షసుల్లాంటి అల్లుళ్ళొస్తే అప్పుడు తెలిసొచ్చేది... వెధవలు ఉన్నదంతా వూడ్చి పెట్టమంటున్నారు. ఈ ఇల్లొకటి మిగిలింది. ఇదీ చప్పరించేద్దామని చూస్తున్నారు.

సుందర రామయ్యకి తిండి సహించలేకపోయింది. మజ్జిగన్నంలో చెయ్యి కడిగేసుకున్నాడు. అది చూసి సీతమ్మ - ''అయ్యయ్యో అదేమిటండీ చెయ్యి కడిగేసుకున్నారు?'' అంది నొచ్చుకుంటూ.

''అయినా అన్నాల దగ్గిర అల్లుడి గారి ఊసు ఎత్తకే'' అంది చిరాగ్గా.

''అయినా నేనేమన్నానని ఆయన అన్న మాటలు చెబుతున్నానమ్మా. మీ అక్కా, బావకి దోచిపెట్టారు, పెడుతున్నారు... ఏం మనమే అంత బరువై పోయామా అంటున్నారమ్మా మీ అల్లుడు గారు!'' అంది వసంత చెయ్యి కడుక్కుంటూ.

పాడిందే పాడరా పాచిపళ్ళ దాసరీ అన్నట్టు అస్తమానూ ఏమిటా మాటలు ...! చిర్రెత్తుకొచ్చింది సుందర రామయ్యకు.

ఆ రాత్రి భోజనాలయ్యాక గదిలోకి వచ్చిన భార్యతో అన్నాడు సుందర రామయ్య.

''మన బ్యాంకు ఖాతా నిల్ - ఇక అప్పే చేయాలి నీ చిన్నల్లుణ్ణి సంతోషపెట్టాలంటే.''

''ఏం చేస్తాం చెయ్యండి'' అంది సీతమ్మ విచారంగా.

సుందర రామయ్యకు అప్పంటే ఇష్టం ఉండదు. ఉన్న దాంతోనే పొదుపుగా వాడి జీవితాన్ని వెళ్ళదీశాడు. ఇప్పుడు అప్పు చేయాలనే నిర్ణయానికి వచ్చిన తర్వాత సుందర రామయ్యకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. తను రోజూ పద్దులు రాసే సేఠ్ దగ్గిరే అప్పు చేయాలి. నెలనెలా కొంత కొట్టుకోమని చెప్పాలి.

లేచి కూర్చున్నాడు సుందర రామయ్య. పండగ నాలుగు రోజులుంది. ఎల్లుండే అల్లుడు వస్తాడు. అంటే రేపు ఎల్లుండి లోగా ఆ ముప్పై వేలు పుట్టించాలి. క్రింద చాపమీద సీతమ్మ ఆదమరిచి నిద్రపోతూ వుంది. ఆవిడ్ని రెప్ప వాల్చకుండా చూశాడు సుందర రామయ్య. ఆవిడ్ని అలా చూస్తుంటే హఠాత్తుగా తన మామగారు గుర్తొచ్చారు.

కిటికీ దగ్గిరగా నడిచాడు - బైట చిక్కని చీకటి. చల్లని గాలులు ఒక్కసారిగా గతాన్ని గుర్తు తెచ్చాయి. నలభై ఏళ్ళ క్రితం మాట - ఇరవై వేలు కట్నం అంటే చాలదని మరో పది వేలు పట్టుబట్టి రాబట్టాడు మామగారి దగ్గిర్నుంచి తను. పెళ్ళిలో అలక పాన్పు ఎక్కి ఉంగరం కావాలన్నాడు. సంక్రాం

తికి మోపెడు కొనమన్నాడు. ఆ కోరికలన్నీ తీరేక పురుళ్ళూ, పుణ్యాలు, బారసాలలు అంటూ నెత్తిన భారం మోపాడు. లబోదిబోమంటూ మామగారు అన్నీ అనుకున్నట్లుగానే జరిపించారు.

''ఏమిటండీ మా నాన్నని అలా రాచి రంపాన పెడతారు ... మీ కోరికల్ని ఎన్నని తీరుస్తారు ... అప్పులు చేయవలసి వస్తూ ఉందని ఎంత కుళ్ళి పోతున్నారో'' అని బాధగా సీతమ్మ అంటే -

''మీ నాన్నని వెనకేసుకొస్తే పుట్టింట్లోనే వుండు'' అనేవాడు. ఎంతో కఠిన హృదయంతో ప్రవర్తించాడు. మామగారు ఆ మహానుభావుడు చచ్చి స్వర్గాన ఎక్కడున్నాడోగాని అప్పట్లో తనని శపించేసి ఉంటాడు నీ అల్లుళ్ళు పీక్కు తినుగాక అని. సిగ్గుగా తలొంచుకున్నాడు సుందర రామయ్య ... అప్పుడు చేసిన పనికి ఇప్పుడూ సిగ్గు ... ఎందుకో ... దీర్ఘంగా నిట్టూర్పు విడిచి - కానివ్వు ఏది జరిగితే అదే జరగనీ అనుకున్నాడు - అసలు ఆణిముత్యంలాంటి అల్లుడు ఎంత పుణ్యం చేసు కుంటేనో దక్కుతాడు ... తను పాపాత్ముడే - అందుకే ఇలాంటి అల్లుళ్ళు దొరికారు ... రేపే సేఠ్‌ని అడగాలి ... కూజాలో మంచి నీళ్ళు త్రాగి మంచం మీద పడుకొని కళ్ళు మూసుకున్నాడు సుందర రామయ్యకి ఎప్పటికో నిద్రపట్టింది.

''నాన్నా మీ అల్లుడు గారు వచ్చారు'' ముందు గదిలోంచి కూతురు అరిచిన అరుపుకి దేవుడి గది లోంచి బైటికొచ్చాడు సుందర రామయ్య. హరి గోపాల్ అప్పుడే ఆటో దిగి లోపలికి వచ్చాడు.

''బాగున్నారా మామగారూ?'' అన్నాడు దగ్గి రగా వచ్చి. ''మిమ్మల్నందర్నీ చూడాలని పించి ఒక రోజు ముందుగా నేవచ్చేశాను'' అన్నాడు నవ్వుతూ.


''బాబూ రాత్రి ఏం తిన్నావో ఏమిటో టిఫె న్నూ, కాఫీ తీసుకుందువు గాని కాళ్ళు కడుక్కొని రా'' అంది సీతమ్మ వచ్చి.

అప్పుడే అల్లుడి గారికి రాచమర్యాదలన్నీ బిగిన్ అయ్యాయన్న మాట. పైపెదవి కొరుక్కున్నాడు సుందర రామయ్య. హరిగోపాల్ వెళ్ళి కాళ్ళు, చేతులు కడుక్కొని వచ్చాడు.

హరిగోపాల్, సుందర రామయ్య కుర్చీల్లో కూర్చున్నారు. సీతమ్మ స్టూల్ జరిపి ఉప్మా, కాఫీ పెట్టింది.

''కాఫీ చల్లారి పోతుంది తీసుకోండి అల్లుడు గారూ'' అన్నాడు సుందర రామయ్య.

''మీరు చాలా చిక్కిపోయారు మామగారూ. ఒంట్లో కులాసాయే కదా ...?'' అన్నాడు హరి గోపాల్ టిఫెన్ తింటూ.




ఎంత తేనె మాటలు ... ఎంత తేనె మాటలు ...! మేడి పండు చూడ మేలిమై ఉండు పొట్టవిప్పి చూడ పురుగులుండు అన్నట్టు వేషం, భాష బాగానే ఉంది. ఆప్యాయతలు, అనురాగాలు పెదవుల మీదే. మామగారు ఉన్నదంతా ఊడ్చి ఇస్తే మహాత్ముడే.

హరిగోపాల్ ఆశ్చర్యంగా - ''అదేమిటి మామ గారూ అలా ఉన్నారు?'' అన్నాడు.

''నాకేం బాగానే ఉన్నానే ...'' నవ్వలేక నవ్వుతూ అన్నాడు సుందర రామయ్య. అయినా నీలాంటి అల్లుడుంటే నాలాంటి మామ బాగా ఎలా ఉంటాడు అనుకున్నాడు.

మామగారు దేనికో బాధ పడుతున్నారని గ్రహించాడు హరిగోపాల్. హరిగోపాల్ టిఫెన్, కాఫీ చేసి స్నానానికి వెళ్ళాడు.

ఒంటరిగా ఏదో ఆలోచిస్తూ కుర్చీలో కూర్చొని ఉన్నాడు సుందర రామయ్య. ఇంతలో తయారై హరిగోపాల్ వచ్చాడు. వసంత వచ్చి తండ్రి చెవిలో నోరుపెట్టి - ''స్కూటర్ డబ్బు సిద్ధంగా ఉందా నాన్నా ఆయన అడిగారు'' అంది గుసగుసగా.

కంగారుగా లేచాడు సుందర రామయ్య - ''ఇదిగో ఆ పని మీదే వెళ్తున్నా'' అంటూ చెప్పులు వేసుకున్నాడు.

''మామగారూ ఒక ఫ్రెండ్‌ని కలవాలి పదండి నేనూ వస్తున్నా అన్నాడు హరిగోపాల్.''

మామా, అల్లుళ్ళిద్దరూ కొంచెం దూరం మౌనంగా నడిచారు.

హఠాత్తుగా హరిగోపాల్ అన్నాడు - ''మామ గారూ మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి.''

గతుక్కుమన్నాడు సుందర రామయ్య కొంప దీసి యాభై వేలు కావాలంటాడా ఏమిటి ...?

''ఆ పార్కులోకి వెళ్ళి మాట్లాడుకుందాం పదండి'' అన్నాడు హరిగోపాల్. ఇద్దరు పార్కులో బెంచీమీద కూర్చున్నారు.

''నన్ను క్షమించండి మామ గారూ - మీ అమ్మాయి సంతృప్తికోసం మీకు అలా లెటర్ రాశాను. వసంత రోజూ ఇంట్లో గోల చేస్తూ ఉంది - వాళ్ళ అక్కయ్యకు మీరు ఎంతెంతో డబ్బు ఇచ్చా రట. మనం పైసా ఎరగం. మనమూ అడుగుదాం నాన్న గారిని అని ఒకటే ఇదై పోతూ ఉంది. ఈ పండక్కి కనీసం స్కూటర్ డబ్బన్నా వసూలు చేద్దాం. ఏం మా అక్కయ్యకు ఇచ్చారు నాకు ఇవ్వరా మా నాన్న అంటూ ఒకటే నస పెడుతూ ఉంది. నాకు ఇలాంటివి ఇష్టం లేదన్నా వసంతకు ఆలో చించే శక్తిలేదు.

అందుకే ఒక ఐడియా ... అంటూ తన చేతి లోని లెదర్ బ్యాగులోంచి నోట్ల కట్టలు తీశాడు - సుందర రామయ్య ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

''మీరు నాకు తండ్రి లాంటివారు. మీరేం అనుకోనంటే ఒక మాట - ఇవిగో ఈ ముప్పై వేలు తీసుకోండి. రేపు వసంత ముందు స్కూటర్ డబ్బు లివిగో అంటూ నాకు అందించండి ... అత్తింటి సొమ్ము దోచుకోవడం నాకు ఇష్టంలేదు మామ గారూ. వసంత గోల పడలేకే ఈ ప్లాను ఆలోచిం చాను. ప్లీజ్ మామగారూ తీసుకోండి.

''ఆణిముత్యం లాంటి అల్లుడివయ్యా'' అంటూ ఒణుకుతున్న చేతులతో అందుకున్నాడు సుందర రామయ్య సంతోషంగా.